విద్యార్థులు మంచి నడవడికతో ఎదగాలి

- ఫేర్వెల్ డే వేడుకల్లో డీఐఈవో వెంకటరమణ
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న డీఐఈవో వెంకటరమణ

నృత్య చేస్తున్న విద్యార్థినులు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 25: విద్యార్థులు మంచి నడవడికను అలవర్చుకొని ఎదగాలని, అప్పుడే భవిష్యత్తులో ఉన్నతస్థాయికి అందుకుంటారని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటరమణ సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫేర్వెల్‌డే వేడుకలు నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థినులు రెండో సంవత్సరం విద్యార్థినీలకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కళాశాల అధ్యాపకులను విద్యార్థులు సన్మానిస్తూ వారి మార్గదర్శకత్వాన్ని కృతజ్ఞతగా గుర్తించారు. రెండేళ్ళపాటు సీనియర్ విద్యార్థులు కళాశాలలో చదివి మంచి నడవడికను అలవర్చుకున్నారన్నారు. భవిష్యత్తులో దృష్టిలో ఉంచుకొని ముందు మరింత కష్టపడి చదివి కన్న తల్లిదండ్రులకు, విద్యాబుద్దులు నేర్పిన గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఎదుగుతున్న స్థాయిని చూసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు గర్వపడేలా ఉండాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంతకు ముందు సరస్వతీదేవి చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని డీఐఈవో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాణి, అధ్యాపకులు లింగయ్య, వెంకటేశ్వర్‌రావు, ఇతరఅధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బీరం విరాళం అందజేత

మాజీ ఎమ్మెల్యే బీరంను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 25 : మండలకేంద్రంలో నిర్మిస్తున్న ఎల్లమ్మతల్లి ఆలయ నిర్మాణానికి మాజీఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి రూ.5లక్షలు భారీ విరాళం ప్రకటించారు. మంగళవారం మండలకేంద్రంలో ఎల్లమ్మ తల్లి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధ్యాత్మిక చింతనతో చాలా సమస్యలకు పరిష్కారం దొరుకుతోందన్నారు. అమ్మవారి దయతో కొల్లాపుర్ పడి పంటలతో సుభిక్షంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణానికి విరాళం అందించిన మాజీఎమ్మెల్యే బీరంను ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సన్మానించారు.

శ్రీశైలం వెళ్లే భక్తులతో రద్దీగా రహదారులు

మన్ననూర్ చెక్‌పోస్ట్ వద్ద నిలిచిన వాహనాలు

అమ్రాబాద్ ఫిబ్రవరి 25 : నేడు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీశైలం వెళ్లే భక్తులతో శ్రీశైలంప్రధాన రహదారి మంగళవారం రద్దీగా మారింది. వాహనాలలో వెళ్లే భక్తులతో మన్ననూర్ చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు నిలిచిపోయాయి. అదేవిధంగా మండలంలోని మన్ననూర్ మీదుగా కాలినడకన శ్రీశైలం వెళ్తున్న శివస్వాములకు అడవి అధికారులు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో అన్నప్రసాదం, మంచి నీరు, మజ్జిగ, పండ్లు అందజేస్తున్నారు. అధికారులు తగిన ఏర్పాట్లు చేయలేదని పలువురు అంటున్నారు.

ఆక్స్‌ఫర్డ్ మోడల్ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్

నృత్యాలతో అలరిస్తున్న విద్యార్థులు

అచ్చంపేట టౌన్, ఫిబ్రవరి 25 : ఆక్స్‌ఫర్డ్ మోడల్‌స్కూల్‌లో మంగళవారం స్పోర్ట్స్ మీట్ సెలబ్రేషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ వేషధారణలతో, నృత్యాలతో అందరినీ అలరించారు. అనంతరం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు ఆడడం ద్వారా విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తలిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కాంసానిపల్లిలో సైన్స్‌ఫేర్ ప్రదర్శన

విద్యార్థుల సైన్స్‌ఫేర్ ప్రదర్శన

ఉప్పునుంతల, ఫిబ్రవరి 25: మండలంలోని కాంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన సైన్స్‌ఫేర్ విద్యార్థులకు సృజనాత్మకతకు వేదికైంది. విద్యార్థులు వివిధ శాస్త్రీయ ప్రదర్శనలు చేసి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా ఎంఈవో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థులలోని పరిశోధన మేధస్సును ప్రోత్సహించేందుకు ఇలాంటి సైన్స్‌ఫేర్ కార్యక్రమాలు అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భాగ్యలక్ష్మి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధికూలీల డబ్బులు వెంటనే చెల్లించాలి

మాట్లాడుతున్న సురేందర్

కొల్లాపుర్ రూరల్, ఫిబ్రవరి 25 : మండలంలోని అమరగిరి గ్రామంలో మండల వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు సురేందర్ అధ్యక్షతన కార్మికుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ 2022 సంవత్సరం నుంచి పెండింగ్‌లో ఉన్న ఉపాధికూలీ డబ్బులు తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డబ్బులు చెల్లించడంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తూ కుంటి సాకులు చెబుతూ ఇప్పటి వరకు చాలా మందికి కూలీల డబ్బులు ఇవ్వడం లేదని విమర్శించారు. కావున ప్రభుత్వం వెంటనే స్పందించి పేదప్రజల డబ్బులు ప్రభుత్వ యంత్రాగం స్పందించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం పది మందితో గ్రామ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షుడిగా వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా మల్లయ్య, ఉపాధ్యక్షుడిగా కురుమయ్య, సహాయ కార్యదర్శిగా నాగరాజు, సభ్యులుగా అంకమ్మ , దేవమ్మ, మైసమ్మ, శివుడు, వెంకటయ్య, తిప్పన్న ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా స్వయపాలన

కల్వకుర్తిలో ఉపాధ్యాయులైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

కల్వకుర్తి, ఫిబ్రవరి 25 : మండలంలోని పంజుగులలె ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటయ్య, హెచ్‌ఎం కృష్ణ, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు గణేశ్ పాల్గొన్నారు.

చారకొండలో..

చార కొండ, ఫిబ్రవరి 25 : మండలంలోని మర్రిపల్లిలో ప్రాథమిక పాఠశాలలో స్వయంపాలన నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శుభాషిణి, ఉపాధ్యాయురాలు పద్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రీపురంలో

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 25 : మండలంలోని శ్రీపురంలో మండలప్రజాపరిషత్ పాఠశాలల్లో స్వయంపాలన జరుపుకొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్ రెడ్డి హెచ్‌ఎం బాలస్వామి పాల్గొన్నారు.

తిమ్మాజిపేటలో..

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 25 : మండలంలోని పలు పాఠశాలల్లో స్వయంపాలన నిర్వహించారు. ఆవంచ జీపీఎస్ పాఠశాల, తిమ్మాజిపేటలో ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారారు.

లింగాలలో..

లింగాల, ఫిబ్రవరి 25 : శాయిన్‌పేట ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయంపాలన నిర్వహించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం జ్యోతిరాణి, హెచ్‌ఎం గణేశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 25 : మండలంలో పలు పాఠశాలల్లో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను నిర్వహించారు.

ఐనోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, బొమ్మనపల్లి మండల పరిషత్ ఉన్నత పాఠశాలలో, అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించారు.

నిరుపేదలందరికీ ఇండ్ల స్థలాలు ఇవ్వాలి

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 25 : మండలంలోని వివిధ గ్రామాల్లో నివసిస్తున్న ప్రతి నిరుపేదలకు ప్రభుత్వమే ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం సీపీఎం మండల నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలకేంద్రం తోపాటు, ఎంగంపల్లితండా, శింగవరం, గోప్లాపురం, జటప్రోల్, కొండూరు, మంచాలకట్ట, మల్లేశ్వరం గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ స్థలంలో అర్హతఉన్న ప్రతినిరుపేదకు ప్రభుత్వం ఇండ్లస్థలాలకు సంబంధించి పట్టాలను పంపిణీ చేసి, రూ.10లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హన్మంతు, ఎల్లగౌడ్, శ్రీనివాసులు, తిమ్మస్వామి, శ్రీను తదితరులు ఉన్నారు.

భౌరాపూర్ జాతరకు తరలివెళ్లిన చెంచులు

ప్రత్యేక బస్సులో తరలివెళ్తున్న చెంచుగిరిజనులు

కొల్లాపుర్, ఫిబ్రవరి 25 : బౌరాపూర్ జాతరకు కొల్లాపూర్ ప్రాంతంలోని చెంచులు కుటుంబ సభ్యులతో కలిసి తరలివెళ్లారు. తెలుగు రాష్ట్రాల్లో పండుగలు, జాతర జరగడం సర్వసాధారణం అయితే నల్లమల అభయారణ్యంలో జరిగే బౌరాపుర్ జాతర అత్యంత ప్రత్యేకమైనది. సమైక్యరాష్ట్రంలో నిర్లక్ష్యానికి గురైన ఈ జాతర బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెలుగులోకి వచ్చింది.

లింగాలనుంచి...

లింగాల, ఫిబ్రవరి 25 : మండలంలోని ప్రాంతంలోని భౌరాపూర్ పెంటలో వెలసిన భ్రమరాంబ మల్లికార్జున జాతర ఉత్సవాలకు మంగళవారం చెంచులు గిరిజనులు ప్రత్యేక బస్సుల్లో భారీగా తరలివెళ్లారు.

ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కోడేరు ఫిబ్రవరి 25; మండల కేంద్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. 25నుంచి 27వ తేదీ వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనువాస్‌రెడ్డి, కార్యదర్శి దూరెడ్డి లక్ష్మారెడ్డి, పాల్గొన్నారు.

నేటి నుంచి కనకదుర్గ ఆలయంలో ఉత్సవాలు

చారకొండ, ఫిబ్రవరి 25 : మండల కేంద్రంలో శివరాత్రి పుర్వదినం పురస్కరించుకొని కనకదుర్గ ఆలయంలో మూడు రోజులపాటు అమ్మవారి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధ్యక్షుడు పార్థసారధిచారి, నిర్వాహకులు రవిచారి, మట్టవెంకటయ్యగౌడ్, జెల్లబాల్‌నారి, ఆంజనేయులు గౌడ్, రామస్వామి, యాదయ్య గౌడ్ బాలచ్చి, జనార్దన్‌గౌడ్‌లు పేర్కొన్నారు.

శివయ్యకు ప్రత్యేక పూజలు

అచ్చంపేట టౌన్, ఫిబ్రవరి 25 : పట్టణంలోని భక్తమార్కండేయ ఆలయంలో శివరాత్రి సందర్భంగా పరమశివుడికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకములు నిర్వహించారు. నేడు పురవీధుల గుండా భజనలు, కోలాటాలతో ఊరేగించి సాయంత్రం పార్వతి పరమేశ్వరులకు కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని ఆలయ అధ్యక్షుడు వనం పర్వతాలు తెలిపారు.

సమస్యలపై నిరంతర పోరాటం చేస్తాం

జెండావిష్కరణలో దివ్యాంగులు

నాగర్‌కర్నూల్ రూరల్, ఫిబ్రవరి 25 : దివ్యాంగుల సంఘం 15వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయ ఆవరణలో సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 15 ఏండ్లుగా దివ్యాంగుల హక్కులకోసం అనేకపోరాటాలు నిర్వహించి విజయం సాధించామన్నారు. రూ.5వేల పెన్షన్ అమలుపై కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు చేయకుండా తీవ్ర అన్యాయం చేస్తుందని దీనిపై పోరాడడం తప్పదని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో దివ్యాంగుల హక్కుల సాధనకు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్మయ్య, ఉపాధ్యక్షుడు అంజయ్య, ఆనంద్, ప్రధాన సహాయ కార్యదర్శి బాలీశ్వర్, గౌరవ అధ్యక్షుడు కోట్ల గౌతమ్, లింగంగౌడ్, నాగరాజుగౌడ్, ఆనంద్, బంగారయ్య, లలిత్ నర్సోజీ, శ్రీశైలం, సిద్దార్థ, అనిత, కౌములమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 25 : జిల్లా కేంద్రంలోని నాగనూలు చౌరస్తాలో అంబిక మద్యం దుకాణంలో గుర్తు తెలియని దుండగులు మంగళవారం తెల్లవారు జామున చోరీకి పాల్పడ్డారు. రోజు మాదిరిగానే దుకాణం తెరిచేందుకు వచ్చిన నిర్వాహకులు చోరీ జరిగినట్లు గుర్తించారు. దుండగులు గడ్డపారతో దుకాణం షట్టర్ తాళాలు విరగ్గొట్టి కౌంటర్‌లో రూ.40వేలకు పైగా ఉన్న నగదు, 20 వేల విలువైన మద్యం సీసాలను ఎత్తుకెళ్లారు. చోరీకి పాల్పడుతున్న ఘటనకు సంబంధించిన సీసీ పుటేజీతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసు కొని దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష..

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 25 : డ్రంకెన్‌డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు శేఖర్‌కు రెండు రోజులు, మరొక వ్యక్తి కేశవులుకు ఒకరోజు జైలు శిక్షతోపాటుగా రూ.100 జరిమానాను సివిల్‌కోర్టు న్యాయమూర్తి కావ్య విధించినట్లు ఎస్సై మాధవ రెడ్డి మంగళవారం తెలిపారు. ఇటీవల కల్వకుర్తిలో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో జడ్చర్ల మండలానికి చెందిన శేఖర్‌కు వంద జరిమానతో పాటుగా రెండురోజుల జైలుశిక్ష, తెల్కపల్లికి చెందిన కేశవులుకురూ.100జరిమానా ఒక రోజుశిక్ష విధించారు.

ఉపాధ్యాయులకు గాయాలు

తిమ్మాజిపేట, ఫిబ్రవరి 25 : పాఠశాలకు ఆటో వస్తున్న ఉపాధ్యాయులకు గాయాలయ్యాయి. స్థానికులు, ఎంఈవో సత్యనారాయణశెట్టి వివరాల మేరకు జడ్చర్ల నుంచి మండలంలోని బుద్దసముద్రానికి మంగళవారం ఉదయం ఉపాధ్యాయులు ప్రయాణిస్తున్న ఆటోను నసుర్లాబాద్–ఆర్గీతం డాల మధ్య బైక్ ఢీ కొట్టడంతో ఆటోలో ఉన్న బుద్దసముద్రం యుపీఎస్ పాఠశాలకు ఉపాధ్యాయులు తిరుపతయ్య, జోత్స్నాదేవి, విజయకుమారిలకు గాయాలయ్యాయి. ప్రమాదంలో తిరుపతయ్య కాలు విరగగా,మిగిలిన ఇద్దరికి స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. మరో వాహనంలో జడ్చర్ల అటు నుంచి మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించారు.

గుర్తుతెలియని మహిళ ఆచూకీ గుర్తింపు

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 25 : పట్టణంలో కేసరి సముద్రం చెరువులో బతుకమ్మ ఘాట్ వద్ద సోమవారం లభ్యమైన గుర్తు తెలియని మహిళ మృతదేహం వివరాలు మంగళవారం గుర్తించారు. మృతురాలు గోపాల్‌పేటకు చెందిన చంద్రమ్మగా గుర్తించినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు. ఈనెల 23వ తేదీన పుట్టింటికి వెళ్తున్నట్లు ఇంటివద్ద చెప్పి జిల్లా కేంద్రంలోని కేసరి సముద్రం చెరువులోపడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఇదిలా ఉండగా గుర్తు తెయని మహిళగా ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కుటుంబ సభ్యులు గుర్తించి మృతదేహాన్ని తీసుకెళ్లారు. కొద్ది రోజులుగా కడుపునొప్పితో బాధపడుతుందని, భరించలేకనే ఆత్మహత్య చేసుకొని ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపినట్లు పోలీసులు వెల్లడించారు.

వైద్యశిబిరం విజయవంతం

కొల్లాపుర్ రూరల్, ఫిబ్రవరి 25 : ఈదమ్మ జాతరలో మంగళవారం వైద్యశాఖ అధికారులు ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. భక్తులకు వైద్యపరీక్షలు నిర్వహించి అనంతరం పలువురికి మందులు పంపిణీ చేశారు. శిబిరంలో డాక్టర్ కావ్యశ్రీ భక్తులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు స్వప్న, హెల్త్ అసిస్టెంట్ సుమిత్ర, అరుణ, గీత, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ

పెద్దకొత్తపల్లి, ఫిబ్రవరి 25 : మండలంలోని వెన్నచెర్ల గ్రామానికి చెందిన మారేడు గాలేమ్మ కుటుంబాన్ని మంగళవారం ఎమ్మెల్సీ గోరటి వెంకన్న పరామర్శించారు. ఇటీవల గాలేమ్మ భర్త చెన్నయ్య మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ వెన్నచెర్ల గ్రామానికి వచ్చి బాధిత కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబానికి అన్ని విధాలుగా ఉంటానన్నారు. ఎమ్మెల్సీ వెంట మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, మాజీ సర్పంచులు సత్యం, చిన్నయ్య, మాజీ ఉపసర్పంచ్‌లు మల్లయ్య, గ్రామస్తులు రాముడు ఉన్నారు.

మల్లన్నకు గజవాహన సేవ

గజవాహనంపై పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

శ్రీశైలం, ఫిబ్రవరి 25 : శ్రీశైలంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు అట్టహసంగా జరుగుతున్నాయి. పదకొండు రోజులపాటు నవవాహ్నిక దీక్షతో పూజాధికాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఏడో రోజైన మంగళవారం ఉదయం చండీశ్వర పూజ మండపారాధన కలశార్చన శివ పంచాక్షరీ జపాను ష్టానాలు రుద్రపారాయణలు రుద్ర హోమం చండీహోమం జరిపించినట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను డప్పుచప్పుళ్లతో క్షేత్రవీధుల్లో ఊరేగించారు. గ్రామోత్సవం గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు, నంది మండపం నుంచి బయలువీరభద్ర స్వామి వరకు ఆద్యంతం నయనానందకరంగా సాగింది. నేడు శివరాత్రి పర్వదినం కావడంతో మల్లన్నను దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుండి లక్షలాదిగా యాత్రికులు తరలివచ్చారు.

అశేశంగా హాజరైన శివస్వాములు

అర్ధరాత్రి దాటిన తరువాత నుంచి పాతాళగంగ వద్దజల్లు స్నానాలు చేసుకుని ఉచిత టిక్కెట్ దర్శనాలకోసం గంటల తరబడి క్యూకాంప్లెక్స్‌లలో వేచిఉన్నారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు భక్తులు తిలకించేందుకు ఏర్పాటు చేసిన కూచుపూడి, భరతనాట్యం, కథక్, హరికథ, బుర్రకథ, భక్తరంజని, నాటికలు వంటి కార్యక్రమాలు అందరినీ అలరిస్తున్నాయని పీఆర్‌వో శ్రీనివాసరావు అన్నారు. జ్యోతిర్లింగము శక్తిపీఠము కలసి ఒకేచోట వెలసి మహిమాన్విత క్షేత్రమే శ్రీశైలం అని శ్రీశైల జగద్గురు పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ చెన్న సిద్దరామ శివాచార్య మహాస్వామి అన్నారు. మంగళవారం ఉదయం క్షేత్రానికి వచ్చిన ఆయనకు కన్నడ భక్తులు ప్రత్యేక పూజలు చేసుకుని గురు ఆశిస్సులు పొందారు.

పాఠశాలలోని రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో

పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో

ఉప్పునుంతల, ఫిబ్రవరి 25 : మండలంలోని సదగోడు, పెద్దాపూర్, లక్ష్మాపూర్, మామిళ్లపల్లి, దాసర్లపల్లి గ్రామాల్లోని పాఠశాలలను మంగళవారం ఎంఈవో చంద్రశేఖర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను విద్యార్థుల హాజరుపట్టికను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, రామస్వామి, జగదీశ్, అమీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

కల్వకుర్తి రూరల్, ఫిబ్రవరి 25 : కల్వకుర్తి పట్టణంలోని టీపీ యూటీఎఫ్ భవనంలో తెలంగాణ సాహితి కల్వకుర్తి ఆధ్వర్యంలో బుధవారం మార్చాల రిటైర్డు జీహెచ్‌ఎం తలసాని రామకృష్ణారెడ్డి రచించిన దర్పణం పుస్తకావిష్కరణ నిర్వహిస్తునట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు.

యూరియా కొరత లేకుండా చూడాలి..

వెల్దండ, ఫిబ్రవరి 25 : రైతులకు యూరియా కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఏవో శోభారాణి అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో సింగిల్‌విండో కార్యాలయ గోదాం, ఫర్టిలైజర్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూరియాను అందుబాటులో ఉంచాలన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

వెల్దండ, ఫిబ్రవరి 25 : మండలంలోని తిమ్మినోనిపల్లి గ్రామంలో మేకల జ్యోతి అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు గండికోట రాజు మృతురాలి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించి రూ.5వేలు ఆర్థికసాయం అందజేశారు. ఉప్పలట్రస్ట్ తరపున రూ.3వేలు అందజేశారు. అదే విధంగా మాజీ ఎంపీటీసీ హరి కిషన్‌నాయక్ రూ.3వేలు అందజేశారు. వారివెంట తిరుపతి రెడ్డి, రాంచందర్, శివ, భాస్కర్, యాదగిరి, రఫీ, నర్సింహ ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

బిజినేపల్లి, ఫిబ్రవరి 25 : విద్యార్థులు ప్రణాళికతో చదివి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించి కళాశాలకు మంచిపేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ ఆనంద్‌గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని శ్రీ వెంకటేశ్వర జూనియర్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు రెండో సంవత్సరం విద్యార్థులకు స్థానిక బాలాజీ గార్డెన్స్‌లో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం అంతకు ముందు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హన్మంతరెడ్డి, మదన్మోహన్‌రెడ్డి ఉన్నారు.

మహిళలకు ఆర్థిక అక్షరాస్యత అవసరం

లింగాల, ఫిబ్రవరి 25 : మహిళలు ఆర్థికంగా ఎదగడానికి అక్షరాస్యత ఎంతో అవసరమని ఎస్‌బీఐ మేనేజర్ మృదల్‌మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని సూరాపూర్ గ్రామంలో ఆర్‌బీఐ అక్షరాస్యత వారోత్సవాల్లో పొదుపు చేసే మహిళా సాధిస్తుంది ఘనత అనే అంశంపై తెలిపారు. ఈ కార్యక్రమంలో మన్సూర్, రూపేశ్, శ్రీశైలం, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సరస్వతి, హెల్త్ సూపర్‌వైజర్ సుజాత, అంగన్వాడీ టీచర్లు యశోద, పాల్గొన్నారు.

వైద్యసేవలు అందించడమే లక్ష్యం

చార కొండ, ఫిబ్రవరి 25 : నిరుపేదలకు ఉచిత వైద్యసేవలు అందించడమే తన లక్ష్యమని మండల కేంద్రానికి చెందిన వైద్యుడు చిలువేరు శ్రీనివాసులు అన్నారు. శ్రీశైలం మల్లికార్జునస్వామి ఆలయంలో భక్తులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. తన తండ్రి మల్లప్ప జ్ఞాపకార్థం ప్రతి ఏటా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నీటి గుంతలోపడి వ్యక్తి మృతి

నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 25: తెలకపల్లి మండల పరిధిలోని పెద్దూరు గ్రామంలో ప్రమాదవశాత్తు నీటిగుంతలోపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. తెలకపల్లి ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం పెద్దూరుకు చెందిన కరుణాకర్(40) తన వ్యవసాయ పొలంలో మొక్కజొన్న పంటకు నీరు పార పెట్టేందుకు వెళ్ళాడు. ఈక్రమంలో మోటారు పైపు తొలగిపోయి నీటిగుంతలో పడింది. దీంతో పైపును తీసే క్రమంలో ఈతరాక పోవడంతో మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సామాజిక తనిఖీపై ప్రజావేదిక

అమ్రాబాద్, ఫిబ్రవరి 25 : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో అడిషనల్ డీఆర్డీవో రాజేశ్వరి ఆధ్వర్యంలో ఎంపీడీవో జగదీశ్వర్ అధ్యక్షతన ఉపాధిహామీ చట్టం 14వ సామాజిక తనిఖీపై ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. 1/4/2023 నుంచి 31/3/2024 తేదీ వరకు మండలంలో జరిగిన అన్ని పనులపై తనిఖీ నిర్వహించగా మండలంలోని 20 గ్రామాల్లో మొత్తం రూ.79,402 పనులు జరిగాయన్నారు. అన్నిపనులు పూర్తిచేసిన వాటిలో రూ.75,402 రికవరి అయ్యాయని తెలిపారు. అదేవిధంగా పనులు పూర్తిచేయని సార్లపల్లి రూ.2వేలు, కల్మలోనిపలి వెయ్యి, ప్రశాంతనగర్‌లని వెయ్యి ఈ మూడు గ్రామాలకు కలిపి రూ.4వేలు జరిమానా విధించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీక్యూఈ కృష్ణారావు, ఎస్టీమ్ అజయ్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు బస్సుసౌకర్యం కల్పించాలి

బల్మూరు, ఫిబ్రవరి 25 : మండలంలోని ప్రజలకు ఉదయం సమయంలో హైదారబాద్‌కు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని అనంతవరం, బల్మూరు, కొండనాగుల, నార్సాయపల్లి, అంబగిరి గ్రామాలకు చెందిన ప్రజలు శివశంకర్, కాశన్న, బాలయ్య, బాలరాజ్, శ్రీశైలం, వెంకటస్వామిలు మంగళవారం కోరారు. ఉదయం 4 గంటల సమయంలో అచ్చంపేట డిపోబస్సు ఈ గ్రామాల మీదుగా లింగాల మండలంలోని గ్రామాల మీదుగా హైదరాబాద్‌కు వెళ్లడం జరుగుతుందన్నారు. ఉదయం 5 లేక 6గంటల సమయంలో లింగాల నుంచి మండలంలోని గ్రామల మీదుగా అచ్చంపేట వయా హైదరాబాద్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు. గతంలో ఉదయం రాత్రి, ఉదయం సమయంలో అప్పాయిపల్లి బస్సు సౌకర్యంగా ఉండేదన్నారు. ఉదయం సమయంలో అచ్చంపేటకు వెళ్లాలంటే 7గంటల తరువాతనే బస్సు ఉండడంతో ప్రయాణికులు, ప్రజలు, విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. అదేవిధంగా ప్రతిరాత్రి 8గంటల సమయంలో అచ్చంపేట నుంచి లింగాలకు నైట్‌హాల్ట్ సమయంలో బస్సును ప్రారంభించాలని అధికారులు, ప్రయాణికులు విద్యార్థులు కోరుతున్నారు. వెంటనే ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని బస్సు సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు.